క్లుప్తంగా

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు

మేడికొండూరు: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ కె.వాసు తెలిపారు. సెంటర్‌లో ఆటో యూనియన్ సంఘ సభ్యులుకు పలు సూచనలు చేశారు. ఆటోలు, తోపుడు బండ్లు రోడ్డు పక్కనే పార్కు చేయవద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌ఐ మధుపవన్ ఉన్నారు.

యూనివర్సల్ కళాశాలలో సదస్సు

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రులోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఎస్‌ఐ మధుపవన్ విద్యార్థి దశలో సరైన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యువజన వ్యవహారాల విభాగం ఇన్‌చార్జిలు వాసంతి, రాధిక శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ఫాతిమా మర్రెడ్డి, డిప్లొమో విభాగ ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైను ఏర్పాటు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ చిర్రావూరులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.20 లక్షలతో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఏఈ కిషోర్ తెలిపిన వివరాలు.. చిర్రావూరు పంచాయతీగా ఉన్న సమయంలో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారని, ఆ పైపులైన్ల ద్వారా చిర్రావూరు మొత్తం అన్ని ప్రాంతాలకు తాగునీటిని అందించలేకపోతున్నామని, ఆ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి 20 లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు చెప్పారు. త్వరలోనే చిర్రావూరుకు తాగునీటి సమస్య పరిష్కారం కానున్నట్లు వివరించారు.

పలు గ్రామాల్లో మిషన్ ఇంద్ర ధనస్సు




ఫిరంగిపురం: మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నట్లు నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఫరీనాబేగం తెలిపారు. ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి ఇంటిలో 0–5 ఏళ్ల లోపు ఉన్న చిన్నారుల వివరాలు, వారికి ఇప్పటి వరకు ఎన్ని వ్యాక్సిన్‌లు వేయించారనే దానిపై వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రతి ఇంటిబయట గోడపై పరిశీలించినట్లు తెలిపే మార్కింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడికొండ: నిబంధనలకు విరుద్ధంగా తుళ్లూరు మండలం పెదపరిమి నుంచి గుంటూరు మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నాగార్జున వివరాలు.. అందిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా కారులో తరలిస్తున్న 249 మద్యం బాటిళ్లు బీర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.48వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బాల్య వివాహాల నిషేధంపై అవగాహన



గుంటూరు రూరల్: బాల్య వివాహాలు చట్టప్రకారం నేరమని, ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు. సచివాలయ మహిళా పోలీసు సుగుణకుమారి విద్యార్థులకు బాల్యం, మానసిక పరిపక్వత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్స్, స్కూల్ సిబ్బంది, డ్వాక్రా, ఆశా, అంగన్వాడీ టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా సంపూర్ణ మద్దతు తెలిపి 2024 ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోరారు. నగరంలోని గాలిగోపురం వద్ద ఉన్న కళావేదిక ఆవరణలో షరాఫ్ బజార్ సచివాలయం, వీవర్స్ కాలనీ, కార్పొరేషన్ పరిధి చినకాకానిలోని ఆయా వార్డులలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలకు రక్ష లాంటిది జగనన్న సురక్ష అన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులను తట్టుకుని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు, తెనాలి డివిజన్ డీఎల్‌డీఓ కె.పద్మావతి, తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్, ఈఓఆర్డీ శ్రీనివాసనాయక్, సెక్రటరీ రమేష్, పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు ఘనత వైఎస్ జగన్‌దే

తాడేపల్లిరూరల్: ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. తాడేపల్లి రూరల్ ఇప్పటంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్కే మాట్లాడుతూ అర్హులు వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన వారికి వివిధ కారణాల వలన అందని వారికి కూడా అందించేందుకు జగనన్న సురక్ష అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటంలో, మెల్లెంపూడి సచివాలయం పరిధిలో మొత్తం 1,787 నివాసాలు తిరిగి 623 మందికి సంబంధించి వివిధ రకాల ధ్రువీకరణ ప్రతాలు అందజేశారని, వారికి అవసరమైన రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు, కుల ధ్రువీకరణ, ఇన్‌కమ్ సర్టిఫికెట్‌లు 623 మందికి అందజేసినట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, డీఈ రెహమాన్, ఈ.ఓ.పి.ఆర్.డి. వెంకటేష్, ఆర్‌ఓ మురళి, తాడేపల్లి రూరల్ గృహ సారథులు జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, లచ్చి వెంకటేశ్వరరావు, గాజుల చిన్న, వీరంకి హరిబాబు గౌడ్, లచ్చితులసీదాసు గౌడ్, బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.



ఇప్పటంలో అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తదితరులు

మేడికొండూరు, జంగంగుట్లపాలెంలో..

మేడికొండూరు: మండల కేంద్రంలోని మేడికొండూరు, జంగంగుట్లపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, జంగంగుంట్లపాలెం సర్పంచి కల్లి శ్రీదేవి సాంబిరెడ్డి, ఎంపీడీఓ కె.ప్రభాకరరావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, ఏపీఎం విజయభారతి, నాయకులు చంటి బాజి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

మందడం(తాడికొండ): గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి కోరారు. తుళ్లూరు మండలం మందడం, పెదపరిమి గ్రామాల్లో జగనన్న సురక్ష నిర్వహించారు. బత్తుల, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌తో కలసి పాల్గొన్నారు. జిల్లాలో రెండవ స్థానంలో నిలిపిన సచివాలయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమాల్లో మందడం సొసైటీ అధ్యక్షుడు ఆలూరి శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, కొప్పుల శేషగిరిరావు, నంబూరు రఘునాధరావు, అక్కల లక్ష్మీనారాయణ రెడ్డి, పోతురాజు, ఆరేపల్లి జోజి, ఐనవోలు సుధీర్, గడ్డం జయరావు, డీజే శ్రీనివాస్ పాల్గొన్నారు.



మందడంలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్‌కుమార్

నిడుముక్కల, మోతడకలో..

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తాడికొండ మండలం నిడుముక్కల, మోతడక గ్రామాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ హాజరై ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేసి, జగనన్న తోడు లబ్ధిదారులతో కలసి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నిడుముక్కల సర్పంచి మాదాసు రత్నకుమారి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, ఎంపీటీసీ బోడపాటి సుశీల, ప్రచార కమిటీ జిల్లా కార్యదర్శి బాకి వెంకట స్వామి, మాజీ ఉప సర్పంచ్ మాదాసు ఏసురత్నం, అత్తోట అక్కయ్య, గుత్తా వెంకటయ్య మాస్టారు, వాడకొప్పుల రాజు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలో 9, 10 గ్రామ సచివాలయాల పరిధిలో జగన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం 9వ సచివాలయ పరిధిలోని నిర్వహించిన ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎంటీఎంసీ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, 9, 10 సచివాలయాల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో పట్టణ గృహసారథుల జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి హాజరయ్యారు.



మంగళగిరిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



ఫిరంగిపురంలో పత్రాలు అందజేస్తున్న కత్తెర సురేష్ కుమార్, జెడ్పీటీసీ కత్తిరేణమ్మ

ప్రతి పథకం ప్రజలకు చేరాలన్నదే వైఎస్ జగన్ లక్ష్యం

ఫిరంగిపురం: రాష్ట్రంలో ప్రతి పథకం ప్రజలకు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఫిరంగిపురం–2 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేసి అందేలా చేసినట్లు తెలిపారు. చంద్రబాబు తన 14ఏళ్ల పాలనలో ఒక్క పథకం ప్రజలకు అందేలా చూడలేదని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచి మేడా బాబు, కె.చిన్నపురెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, వై.యల్లారెడ్డి, డి.నరేంద్రకుమార్, పి.రఘు, పి.చిన్న, తహసీల్దార్ పద్మనాభుడు, డీటీ రాజారమేష్ మోహన్, ఎంపీడీఓ డి.అనూరాధ, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, ఏపీఎం సుజాత పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని శృంగారపురం, పెనుమూలి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ముఖ్యఅతిథులుగా హాజరై ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, మండల అభివృద్ధి అధికారి కుసుమ శ్రీదేవి, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, శృంగారపురం సర్పంచి కొండూరు సుధారాణి, పెనుమూలి సర్పంచి కొరిటాల పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సురేష్, ఉప సర్పంచులు తియ్యగూర భాగ్యలక్ష్మి, ఉయ్యూరు రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.రత్నం, కె.సురేష్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కె.ముత్తయ్య, వి.సుబ్బారావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

పంపు హౌస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: పట్టణ వాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. నగరంలోని తాగునీటి పథకం ఆవరణలో నిర్మాణంలో ఉన్న రా వాటర్ పంప్ హౌస్‌తో పాటు స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ ట్రాక్ పనులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు ఆకురాతి రాజేష్, బొంతు నాగిరెడ్డి, బేతపూడి నర్సయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. మంగళవారం నగరంలోని ఆటోనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నియోజకవర్గ ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌తో పాటు ప్యూన్‌లను ఆగస్టు 1వ తేదీ నుంచి తప్పనిసరిగా నియమించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల విద్యాశాఖ అధికారులు ఎస్.బాబు, కాజ శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ ప్రొఫెసర్‌కు రూ.20 లక్షల సీఎస్ఐఆర్ ప్రాజెక్ట్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్ అండ్ ఫార్మాస్యూటికల్స్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ కె.శ్రీకాంత్‌కి న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) నుంచి రూ.20.14 లక్షల విలువ గల ప్రాజెక్టు మంజూరైందని వర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ''మోనిటరింగ్ అండ్ మ్యాపింగ్ ఆఫ్ మైక్రో ప్లాస్టిక్ కంటామినేషన్ ఇన్ చిలికా లేక్ ఎకోసిస్టమ్ ఒడిశా, ఇండియా'' అనే అంశంపై పరిశోధనకు గాను రాబోయే మూడేళ్లకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. సీఎస్ఐఆర్ ప్రాజెక్ట్ గ్రాంట్ సాధించిన ప్రొఫెసర్ కె.శ్రీకాంత్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.



గ్రాంట్ సాధించిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్‌ను అభినందిస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయలు

వైద్యవిద్యార్థులకు రోటరీ క్లబ్ సాయం

తెనాలి: రోటరీ క్లబ్ తెనాలి సేవలు శ్లాఘనీయమని రోటరీ క్లబ్ (నెం.3150) అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో మంగళవారం వైద్యవిద్యార్థులకు రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. క్లబ్ తెనాలి అధ్యక్షుడు పావులూరి రాంబాబు అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రోటరీ క్లబ్ సేవల్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు. రోటరీ సేవల్లో తన వంతు సాయం అందిస్తానని గణేష్ యూత్ వీరవల్లి మురళి చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన రూరల్ మండల గ్రామం అంగల కుదురులో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ షబీనాకు రూ.50 వేల ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. వైద్యవిద్యార్థులు నిడుముక్కల మహేష్, మౌనిలకు ఆర్థికసాయం అందించిన కె.సుబ్రహ్మణ్యం, క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, జెట్టి శివరామకృష్ణప్రసాద్, ఈదర వెంకట పూర్ణచంద్, జీవీ నారాయణ, ప్రవీణ్, ఆలపాటి కిరణ్, నాగభూషణం పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న క్లబ్ బాధ్యులు

మెడికల్ షాపులో చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఎదుట ఉన్న మెడికల్ షాపులో రూ.1.50లక్షల చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు.. గౌతమబుద్ధా రోడ్డు అనుకుని మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి దుకాణం మూసి వేసి నిర్వాహకులు మంగళవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చే సరికి తాళాలు పగలు కొట్టి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించి షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం..

నగరంలోని మిద్దె సెంటర్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురి అయిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన జె.కిరణ్‌కుమార్ మంగళవారం ఉదయం మిద్దె సెంటర్‌లో ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి షాపింగ్‌కు వెళ్లాడు. కిరణ్‌కుమార్ తిరిగి వచ్చేటప్పటికి ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

29 బస్తాల బియ్యం స్వాధీనం

నగరంలో ఓ ఆటోలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో రాజీవ్ సెంటర్‌లో తనిఖీలలో బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని ఆటోని స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్చకుల వేతనం పెంపునకు కృషి

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈఓలు, అర్చకులు, సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అర్చకులకు రైతు భరోసా కింద వచ్చే ప్రతిఫలాన్ని అందేలా చూడాలన్నారు. అన్యాక్రాంత భూములను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలి

- లేకుంటే చర్యలు తప్పవు
- నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లను పరిశీలించిన నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం చేయాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నవభారత్ నగర్, జేకేసీ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్‌టీపీలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా చూడాలని, అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలన్నారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్ కుమార్, టీపీఎస్ గోవర్ధన్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్లాన్ కాపీలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

రైల్వే ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన శిక్షలు


తెనాలిరూరల్: రైల్వే ఆస్తులను ధ్వంసం చేయడం, నష్ట పరచడం వంటి చర్యలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడే అవకాశముందని తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టీవీ రమణ తెలిపారు. రైల్వే రూల్స్, రైళ్ల మీద రాళ్లతో దాడి చేడం, లెవల్‌క్రాసింగ్ వద్ద పాటించాల్సిన నిబంధనల గురించి రైల్వే అధికారులతో కలిసి మంగళవారం ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. తెనాలి మోరిస్‌పేటలోని రేపల్లె గేటు వద్ద ప్రజలతో మాట్లాడారు. రైల్వే ఆస్తులను నష్టం కలిగించూడదన్నారు. ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడతాయన్నారు. రైల్వే శిక్షాస్మృతి గురించి వివరించారు. ఆయన వెంట ఆపరేషన్ సేఫ్టీ కౌన్సెలర్‌ఎంవీఎస్ గురునాథ్, ఇంజినీరింగ్ సేఫటీ కౌన్సెలర్ జి.హరినారాయణ, సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైన ఖోఖో పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడా సాధనతో చక్కని ఆరోగ్యమేకాకుండా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలో తెలుస్తుందని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి రోశయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ ఈఎం స్కూల్లో ఆంధ్ర, తెలంగాణ స్థాయి అండర్–14, 17, 19 ఖోఖో పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ పోటీలో విజయాలు సాధించడకంటే పోటీల్లో పాల్గొనడమే ప్రధానంగా భావించాలన్నారు. విజయం సాధించే ముందు పొందే ఓటములే ఉన్నత జీవితానికి పునాదులన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రీడలవైపు ప్రోత్సహించాలని కోరారు. బిషప్ మాట్లాడుతూ ఈ పోటీలు 3 రోజులపాటు కొనసాగుతాయన్నారు. సుమారు 600 మంది వీటిలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ సిస్టర్ హెలెన్, ప్రిన్సిపాల్ ఫాదర్ భరత్ రెడ్డి, సవేరి, ఆచార్య సురేష్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రముఖ పసుపు వ్యాపారి జంపాల మృతి

దుగ్గిరాల(తెనాలి): ప్రముఖ పసుపు వ్యాపారి జంపాల వెంకట కృష్ణారావు(82) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పసుపు వాణిజ్య కేంద్రమైన దుగ్గిరాలలో ప్రముఖ వ్యాపారుల్లో వెంకట కృష్ణారావు ఒకరుగా గుర్తింపు పొందారు. గ్రామ రాజకీయాలపై ఆసక్తితో 40 ఏళ్ల క్రితం గ్రామ సర్పంచిగా పోటీచేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. రెండో సార్లు సర్పంచిగా పనిచేశారు. దుగ్గిరాల మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగానూ ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగానూ వ్యవహరించారు. తెనాలిలోని ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి కమిటీలోనూ కృష్ణారావు కొనసాగారు. కృష్ణారావు అంతిమయాత్రను బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జంపాల మృతికి సంతాపంగా దుగ్గిరాల మార్కెట్‌యార్డుకు సెలవు ప్రకటించారు.



జంపాల వెంకట కృష్ణారావు (ఫైల్)